నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల సోమవారం 25 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

రెబ్బెన లో నివాళులర్పిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, మార్చి 24: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పష్టం చేశారు. రెబ్బెన బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు రాపర్తి అశోక్ తల్లి రాపర్తి విమల ఆదివారం మృతిచెందగా, భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్పర్సన్ కుందారపు శంకరమ్మ, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, బీఆర్ఎస్ మహిళా మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, నాయకులు దుర్గం భరద్వాజ్, రామడుగుల శంకర్, తదితరులున్నారు.

## మావోయిస్టులకు సహకరించవద్దు

**ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య**

ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ సదయ్య

వాంకిడి, మార్చి 24: యువత, ప్రజలు మావోయిస్టులకు సహకరించి, భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సూచించారు. మండలంలోని వెల్గి, లక్ష్మీపూర్ మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం ఉదయం వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్, కేంద్ర బలగాలతో కలసి పర్యటించారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు అందుబాటులో ఉంటారని, ఎలాంటి సమస్య ఉన్నా సమాచారం అందించి పరిష్కరించుకోవాలని కోరారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై సమాచారం అందించాలన్నారు. పంటలకు రక్షణగా అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుత్తీగలను అమర్చవద్దని కోరారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు కావొద్దని సూచించారు. మండల కేంద్రంలోని ఖమాన అండర్ పాస్ బ్రిడ్జ్ నుంచి హనుమాన్ మందిర్ వీధుల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు.

## రంగుల కేళీ.. హోలీ..

నేడు జిల్లాలో వసంతోత్సవం..

- కులమతాలకతీతంగా వేడుక..
- సహజ రంగులే వాడాలని నిపుణుల పిలుపు

చెన్నూర్ టౌన్, మార్చి 24 : 'హోలీ..హోలీల రంగ హోలీ ..చెమ్మకేళిల హోలీ' అంటూ ఏడాదికోసారి నిర్వహించుకునే రంగుల వేడుకకు ఉమ్మడి జిల్లా ప్రజానీకం సిద్ధమైంది. చిన్నా,పెద్ద ఆనందడోలికల్లో మునిగి తేలనుండగా, మోములన్నీ వర్ణ శోభితం కానున్నాయి. స్నేహితులు, ఇంటిల్లిపాది, బంధువులతో ఊరువాడా సందడి నెలకొననుంది. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు నిర్వహించే ఈ వసంతకేళిలో సహజ రంగులు వాడాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు.

### ఉత్సాహంగా వసంతోత్సవం

వసంత కాలంలో వచ్చే పండుగ కాబట్టి దీన్ని 'వసంతోత్సవం' అని కూడా పిలుస్తారు. హోలీ అంటే అగ్ని కానీ, అగ్నితో పునీతమైనది అని చెబుతుంటారు. ఇది చెడుపై మంచి సాధించిన విజయాన్ని కూడా సూచిస్తుంది. ఇది హిరణ్యకశ్యపుడిపై నారసింహుడి విజయంగా కూడా పేర్కొంటారు. జిల్లాలో ఆదివారం కాముని పున్నం నిర్వహించారు. హోలికా దహనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం హోలీ పండుగకు సిద్ధమయ్యారు. ఆకర్షణీయమైన వర్ణద్రవ్యాలు, సింథటిక్ రంగులతో నిర్వహించుకుంటే చర్మ సంబంధ సమస్యలు వస్తాయని, సహజ రంగులను వినియోగించాలని వైద్యులు సూచిస్తున్నారు.

### నీటి వనరుల వద్ద జాగ్రత్త...

హోలీ వేడుకలు ముగిశాక స్నానం చేసేందుకు పిల్లలు చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్లేందుకు ఉత్సాహం చూపుతుంటారు. తల్లిదండ్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంత వరకు చెరువులు, బావుల వద్దకు వెళ్లకుండా చూడాలి. ఇంట్లోనే స్నానం చేయడం మంచిది.

## విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టొద్దు

**పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమ్మయ్య**

సీసీసీ నస్పూర్, మార్చి 24: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400 కేవీ విద్యుత్ లైన్ల కింద పంట మిగులును తగులబెట్టవద్దని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం సమ్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల కింద పంటలు పండించే రైతులు చేనులో మిగిలిన చెత్తను కాల్చివేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. మంచిర్యాల నుంచి వెళ్లే రామగుండం–చంద్రాపూర్ లైన్, రాయగఢ్–పుగలూరు విద్యుత్ లైన్ల పరిధిలోని జైపూర్, కాసిపేట, మందమర్రి, బెల్లంపల్లి, తాండూర్, మండలాల పరిధిలో విద్యుత్ లైన్ల కింద పంట సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద మంటలు పెడితే కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, సమీపంలోని జంతువులు, మానవులకు హాని జరిగే అవకాశం ఉంటుందన్నారు. రైతులు గమనించి ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టవద్దని కోరారు.

# పూత లేదు.. కాత రాదు..

● 'కాయ' కనిపించట్లే..

పూతకురాని మామిడి చెట్లు

### మామిడి రైతుల ఆశలు గల్లంతు

- గతేడాది దెబ్బ తీసిన పండు ఈగ
- ఈ యేడాది ప్రతికూల వాతావరణం
- రూ.400 కోట్ల వ్యాపారంపై ప్రభావం
- కొనడానికి ముందుకురాని వ్యాపారులు
- ఆందోళనలో అన్నదాతలు

*మామిడి రైతుల ఆశలు గల్లంతయ్యాయి. ఏ తోటకెళ్లి చూసినా.. ఒక్క మామిడి కాయ కనిపించడం లేదు. కనీసం పెట్టుబడి తిరిగి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దిగుబడి లేదని తెలిసి మామిడి కొనుగోలు చేయాల్సిన వ్యాపారులు తోటల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు రూ.400 కోట్ల వ్యాపారంపై నీలినీడలు కమ్ముకున్నాయి.*

మంచిర్యాల, మార్చి 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 26 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగయ్యాయి. జిల్లాలో బంగెనపల్లి, దసేరి, లంగ్డా, చెక్కర గుంటి, చెరుకు రసాల వంటివి 50 రకాలు సాగవుతున్నాయి. వీటితోపాటు పచ్చడి రకాలు కూడా పండుతాయి. వాతావరణం అనుకూలంగా ఉంటే యేటా జిల్లాలో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల పంట చేతికొచ్చేది. కానీ.. ఈ ఏడాది ఐదు శాతం కాయలు కూడా తోటల్లో కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### ప్రతికూల వాతావరణం.. తెగుళ్ల తో ఇబ్బందులు..

వాతావరణంలో మార్పులు మామిడి పంటలపై తీవ్రప్రభావం చూపాయి. ఆశించిన మేర వర్షాలు కురవక పోవడం, నేలలో తేమ శాతం పడిపోవడంతో సకాలంలో చెట్లు చిగురించక.. పూత రాకుండా పోయింది. దీనికితోడు తెగుళ్లు వచ్చాయి. మామిడి చెట్లు చిగురించే సమయంలో ఆకులపై లీప్ వెబ్బర్(బల్లిపాతర) వచ్చింది. చిగురించే కొనలపై బల్లిపాతర చుట్టుకోవడంతో పూతకు అడ్డుపడింది. దీంతో దాదాపు చెట్టు నిండా రావాల్సిన పూత 20 శాతం కూడా రాలేదు. పైగా అది కూడా చాలా ఆలస్యంగా రావడంతో కొద్దిరోజులుగా మండిపోతున్న ఎండలకు నేల రాలాయి. దీంతో పూత, కాత కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. సాధారణంగా నవంబర్‌లో రావాల్సిన పూత జనవరి చివరి వరకు కూడా రాలేదంటున్నారు. పిందే పట్టాల్సిన పూత కూడా చివరి దశలో రాలిపోతుందంటున్నారు. పోనీ ఆలస్యంగా పూత వస్తుందనుకుంటే పొగమంచు, చలి తీవ్రత, మబ్బులు రావడంతో ఏం చేయలేని పరిస్థితి వచ్చిందంటున్నారు. అసలు పూత, కాత రాకుండా పోయిందని బోరుమంటున్నారు. గతేడాది పండు ఈగ ప్రభావంతో దాదాపు రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల పంట నేలపాలయింది. ఇప్పుడేమో లీప్ వెబ్బర్, వాతావరణ ప్రభావంతో రైతులు కోలుకోలేని దెబ్బతింటున్నారు. పూత ఆలస్యంగా రావడంతో మామిడి వ్యాపారులు ఎవరు తోటలపై ఆసక్తి చూపడంలేదు. పూత సమయంలోనే వచ్చి రైతులతో మాట్లాడుకుని అడ్వాన్సులు ఇచ్చే నాగ్‌పూర్ వ్యాపారులు మామిడి తోటలవైపు కన్నెత్తి చూడడం లేదు. లోకల్ వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో వచ్చే ఐదు శాతం పంటను ఎలా విక్రయించాలో తెలియక రైతులు అల్లాడిపోతున్నారు.

### 50 ఎకరాలు కౌలుకు తీసుకున్న..

నేను 50 ఎకరాల మామిడి తోటలు కౌలుకు తీసుకున్న. పూత ఆలస్యంగా వస్తుందని కాయ మంచిగా కాయాలని మందులు పిచికారీ చేసిన. పూత నిలువక, కాయలు పడలేదు. అక్కడక్కడా కాసిన కాయ కూడా నిలుస్తుందో లేదోనన్న భయం ఉంది. గతేడాది 200 ఎకరాలకు పైగా తోటలను గుత్తకు తీసుకుని వ్యాపారం చేశా. పండు ఈగతో చాలా నష్టపోయా. ఈసారైనా పూత మంచిగా వస్తుందనుకుని ఆశపడ్డా. ఇప్పటి వరకు తోటలో చెట్లపై అనుకున్నంత కాత లేదు. ఎండలు ముదిరితే చెట్లపై ఒక్క పిందే కూడా ఉండదు. ఇప్పుడు ఏం చేయాలో అర్థమైతలేదు.

**- గన్న అంజన్న, మామిడి రైతు, వ్యాపారి.**

చెట్లనిండా పూత ఉండి కాతలేని చెట్లు

### చెట్లకు కాయలు లేవు..

ఈ ఏడాది మామిడి పూత అనుకున్నంతగా రాలేదు. ఇప్పటికే పిందే పట్టి వంద గ్రాముల బరువు పెరగాలి. ఎక్కడ చూద్దామన్న కాయ కనిపించడం లేదు. ఆలస్యంగా పూత వస్తే కాత నిలవదు. పంట అనుకున్నంత రాదు. తోటలను నమ్ముకుని ఉన్న రైతులకు ఈ యేడు నష్టమే వచ్చింది. ప్రతి యేడో ఒక కారణంతో నష్ట పోతున్నాం. ఐదెకరాల తోటలో కనీసం పది చెట్లు కూడా పూర్తిగా పూతకు రాలేదు. పూత వచ్చిన కాయ రావడం లేదు. ఎన్ని మందులు కొట్టినా రోగాలు పోలేదు. చెట్టు నిండా బల్లి పాతర పట్టి పూతరాకుండా చేసింది. బల్లి పాతర పోవడానికి వేల రూపాయల మందులు కొట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. దాదాపు అరవై ఎకరాల తోటలను కౌలుకు తీసుకున్నా.. లక్షల పెట్టుబడి పెట్టినా.. లాభం లేకుండా పోయింది. ఎకరానికి కనీసం రెండు క్వింటాళ్లు కూడా పంట వచ్చే పరిస్థితి లేదు.

**- మెండె నర్సయ్య, మామిడి రైతు.**

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎండీ మల్లికా రత్నకుమారి గ్రంథి, డాక్టర్ విష్ణువర్ధనరావు, తొగరు సుధాకర్, వెంకట నారాయణ

కస్టమర్లకు ఆభరణాలు చూపిస్తున్న సీఎండీ మల్లికా రత్నకుమారి గ్రంథి

## కోరుకున్న డిజైన్లలో బంగారు ఆభరణాలు

**-వైభవ్ జ్యువెల్లర్స్ సీఎండీ భారత మల్లికా రత్నకుమారి**

^మంచిర్యాల అర్బన్, మార్చి 24 : జిల్లాలో కస్టమర్లు కోరుకున్న డిజైన్లలో నాణ్యమైన బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు, ప్లాటినం, రత్నాలు, వెండి ఆభరణాలను సరసమైన ధరలో అందుబాటులోకి తెచ్చామని వైభవ్ సంస్థల సీఎండీ మల్లికా రత్నకుమారి గ్రంథి తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర థియేటర్ ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేసిన వైభవ్ జ్యువెల్లరీని ఆదివారం డాక్టర్ విష్ణువర్ధన రావు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు తొగరు సుధాకర్, వెంకట నారాయణతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కస్టమర్లనుద్దేశించి సీఎండీ మాట్లాడుతూ ఇప్పటి వరకు కోస్తా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో 14 బ్రాంచీలతో వైభవ్ జ్యువెల్లరీ (మనోజ్ వైభవ్ జెమ్స్ 'ఎన్' జ్యూయలర్స్ లిమిటెడ్) ప్రారంభించామని,ప్రస్తుతం మంచిర్యాలలో 15వ షోరూంని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వినియోగదారులకు 916 హాల్ మార్క్‌డ్ బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్, ఫైన్ జ్యూయలరీ, 925 స్వచ్ఛత కలిగి 100 శాతం తిరిగి కొనుగోలు హామీ గల స్టెర్లింగ్ వస్తువులు, సాధారణ వెండి వస్తువులు, జ్యువెల్లరీని బంగారు ప్రియులకు సరసమైన ధరలకు నాణ్యతమైనవి అందించనున్నామన్నారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని సాధారణ బంగారు ఆభరణాలపై (వీఏ) తరుగు కేవలం 9 శాతం, స్టోన్ స్టడెడ్, ఏంటిక్ జ్యువెల్లరీపై గ్రాముకు రూ. 150 వరకు తగ్గింపుతోపాటు వీవీఎస్ ఈఎఫ్ నాణ్యత గల డైమండ్స్ క్యారెట్‌కు రూ. 60 వేలు, సాధారణ వెండి వస్తువులను తయారీ చార్జీలు లేకుండా అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని కస్టమర్లు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీవోవో గొంట్ల రాఖాల్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సింధూరీవెంకటేశ్, ఏలూరు వైభవ్ జ్యువెల్లర్స్ ఎండీ అమరేంద్ర గ్రంథి, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ రఘునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ హై అలర్ట్

- గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌తో అప్రమత్తమైన పోలీసులు
- నిరంతరం పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ
- సరిహద్దుల్లో నిత్యం తనిఖీలు
- ప్రాణహిత ప్రాంత అడవుల్లో కూంబింగ్
- కంట్రోల్ రూమ్ నం.08733 279033 ఏర్పాటు

పోలీసులకు శిక్షణ ఇస్తున్న ఎస్పీ సురేష్ కుమార్

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. ఇటీవల గడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్ మావోయిస్టులు మృతి చెందగా, పోలీసుశాఖ అప్రమత్తమైంది. జిల్లా సరిహద్దులతో పాటు చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన నిఘా పెట్టింది. కలెక్టర్ వెంకటేశ్ దోత్రేతో పాటు ఎస్పీ సురేశ్‌కుమార్ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ తనిఖీలు చేపడుతున్నారు. మద్యంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 87,887 రూపాయల విలువగల 173 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 23 లక్షల 89 వేల 990, 17 ఎల్‌జీ మిక్సర్‌లు, 43 కూలర్లను పట్టుకున్నారు. వీటి విలువల సుమారు రూ.1.75 లక్షల వరకు ఉంటుంది. 1.05 కేజీల గంజాయిని కూడా పట్టుకున్నారు. 31 మందిని బైండోవర్ చేశారు. మారుమూల గ్రామాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ అపరిచితులు, కొత్తవారి మాటలు నమ్మవద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీస్ కంట్రోల్ రూం నంబర్. 08733 279033కు సమాచారమివ్వాలని సూచిస్తున్నారు.

### గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌తో అప్రమత్తం

ఇటీవలగడ్చిరోలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మంగి–ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శి డీవీసీఎం వర్గీష్, సిర్పూర్– చెన్నూర్ ఏరియా కమిటీ కార్యదర్శి డీవీసీఎం మగ్తు చనిపోవడంతో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఎన్నికల భద్రత కోసం వచ్చిన పోలీసు గ్రేహౌండ్స్ దళాలను అప్రమత్తం చేయడంతో పాటు జిల్లాలోని ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో గట్టి నిఘా పెంచారు. ప్రాణహిత సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండడంతో నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి మావోయిస్టుల కదలికలు లేనప్పటికీ పొరుగునే ఉన్న గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్ జరగడం, ఈ ఘటనలో చనిపోయిన మావోయిస్టులు వర్గీస్, మగ్తు ఉమ్మడి జిల్లాతో సంబంధం ఉండడంతో పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు. ప్రాణహితను సరిహద్దుల వెంబడి ఉన్న అడవుల్లో కూంబింగ్ పెంచారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు పూర్తిగా పోలీసుల నిఘా నీడలో జరుగనున్నాయి.

# 'రేషన్' ఈకేవైసీ @80.81%

- కార్డుల ఆధారంగా యూనిట్ల పరిశీలన
- వేలి ముద్ర వేసిన వారి పేర్లే లెక్కలోకి..
- మిగతా వారు హోల్డ్‌లోకి..

ఈకేవైసీ చేసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

మంచిర్యాల అర్బన్, మార్చి 24 : రేషన్ కార్డుకు ఈకేవైసీ తప్పనిసరి చేస్తూ ఆరు నెలల క్రితం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని కార్డుల్లో సభ్యులు చనిపోవడమో లేదా పెండ్లి చేసుకొని వేరే ఇంటికి వెళ్లిపోవడమో జరిగినా, చాలా వరకు పేర్లు కార్డులలో అలాగే కొనసాగుతున్నాయి. అలాంటి వాటిని ఏరివేసే కార్యక్రమం ప్రభుత్వం మొదలు పెట్టింది. ఇందులో భాగంగానే ఆహార భద్రత కార్డులోని సభ్యులందరూ సంబంధిత రేషన్ దుకాణానికి వెళ్లి ఈకేవైసీ(నో యువర్ కస్టమర్) చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

### బోగస్‌కు చెక్ పెట్టేందుకు ఈకేవైసీ...

రేషన్ లబ్ధిదారుల కార్డుల వివరాలను నవీకరించడం ద్వారా అనర్హులను గుర్తించవచ్చనే ఉద్దేశంతో పౌరసరఫరాల శాఖ ఈ నిర్ణయం తీసుకొని అమలు చేసింది. జిల్లాలో 423 రేషన్ దుకాణాలుండగా, వీటి పరిధిలో 2,19,421 (ఏఎఫ్ఎస్‌సీ 15,490, ఎఫ్ఎస్‌సీ 2,03,771, ఏఏపీ 160) కార్డులుండగా వీటి పరిధిలో 6,40,989 (ఏఎఫ్ఎస్‌సీ 47,880, ఎఫ్ఎస్‌సీ 5,92,948, ఏఏపీ 161) యూనిట్లు ఉన్నాయి. ఇందులో ఏఏపీ (అన్నపూర్ణ) కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు 10 కిలోలు, ఏఎఫ్ఎస్‌సీ (అంత్యోదయ) కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు 35 కిలోలు, ఎఫ్ఎస్‌సీ కార్డు లబ్ధిదారులకు ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం అందజేస్తున్నది. కొన్ని చోట్ల మృతి చెందిన వారి పేరిట ప్రతి నెలా ఉచితంగా రేషన్ తీసుకుంటున్నారు. ఇలాంటి యూనిట్లను ఈకేవైసీతో ఏరివేశారు.

### కార్డుల ఆధారంగా యూనిట్ల పరిశీలన

రేషన్ కార్డుల ఆధారంగా యూనిట్లను పరిశీలించనున్నారు. జిల్లాలో 2,19,421 కార్డులు ఉండగా 6,40,989 యూనిట్లు ఉన్నాయి. ఈ పాస్ మిషన్‌లో కార్డుదారు ఆధార్ నంబర్ నమోదు చేయగానే ఆ కార్డులో ఎందరు ఉన్నారో (ఎన్ని యూనిట్లు ఉన్నాయో) చూపిస్తుంది. వారందరూ ఆధార్‌తో రేషన్ దుకాణానికి హాజరై వేలి ముద్ర వేయాల్సి ఉంటుంది. ఒక వేళ లబ్ధిదారుడు ఆధార్ నవీకరణ ఇది వరకే చేసుకుంటే ఆ విషయాన్ని రేషన్ దుకాణంలో తెలియజేయాల్సి ఉంటుంది. ఎవరైతే ఈకేవైసీకి హాజరు కారో వారి పేరు (ఆయూనిట్)ను హోల్డ్‌లో పెడుతున్నారు. వేలి ముద్ర వేసిన వారి పేర్లే కనిపిస్తుంటాయి.

### జిల్లాలో 80.81 శాతమే పూర్తి...

రేషన్ ఈకేవైసీకి 2023, డిసెంబర్ 31 ఆఖరు కాగా అప్పటి వరకు సగం కూడా ఈకేవైసీ ఇవ్వకపోవడం ప్రభుత్వం దానిని ఫిబ్రవరి నెలాఖరు వరకు పొడిగించింది. ఇప్పటి వరకు జిల్లాలో 80.81 శాతం మాత్రమే లబ్ధిదారులు ఆన్‌లైన్ చేయించుకున్నారు. బెల్లంపల్లి మండలంలో 78.49, భీమినిలో 79.08, చెన్నూర్‌లో 78.96, దండేపల్లిలో 81, జైపూర్‌లో 85.65, జన్నారంలో 81.52, కాసిపేటలో 83.87, కోటపల్లిలో 80.97, లక్షెట్టిపేటలో 83.93, మంచిర్యాలలో 78.25, మందమర్రిలో 81.10, తాండూరులో 83.17, వేమనపల్లిలో 80.37, నస్పూర్‌లో 79.17, హాజీపూర్‌లో 83.18, భీమారంలో 81.97, కన్నెపల్లిలో 79.23, నెన్నెల మండలంలో 78.95 శాతం రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 80.81 శాతం ఈకేవైసీ కాగా, మిగిలిన వారి కోసం మరో అవకాశం ఇస్తుందా, లేదా ఆ యూనిట్లను తొలగిస్తుందా.. వేచిచూడాల్సిందే.

## దుమ్ముతో ఇబ్బందులు

నెన్నెల సమీపంలో రోడ్డుపై లారీ వెనుకాల దుమ్ము

నెన్నెల, మార్చి 24: నెన్నెల నుంచి మన్నెగూడెం వరకు ఉన్న రోడ్డుపై కంకర వేసి ఆరు నెలలు కావస్తున్నా, బీటీ వేయలేదు. ఈ రోడ్డు గుండా నిత్యం లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగించడంతో, దుమ్ము భారీగా లేచి ఇండ్లపై పడుతున్నది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై వెళ్లాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. ఈ రోడ్డు కోసం 2023 అక్టోబర్‌లో రూ. కోటి మంజూరు చేశారు. టెండర్ పూర్తి కావడంతో పనులు ప్రారంభించారు. ఉన్న బీటీని తొలగించి దానిపై కంకంర వేసి రోలింగ్ చేశారు. ఇదే రోడ్డుపై ఇసుక రీచ్‌కు నిత్యం 200 ట్రాక్టర్లు, పదుల కొద్ది లారీలు నడుస్తున్నాయి. దీంతో దుమ్ముతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించడం లేదు. అధికారులు స్పందించి, త్వరగా బీటీ వేయాలని స్థానికులు కోరుతున్నారు.